క్లుప్తంగా

అనుమతుల్లేని కళాశాలల సీజ్‌కు వినతి



ఆర్‌ఐఓకు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ఇంటర్ బోర్డు నిబంధనల మేరకు అనుమతుల్లేని జూనియర్ కళాశాలలను సీజ్ చేయాలని పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌ఐఓ కార్యాలయంలో ఆర్‌ఐఓ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని మంగళవారం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. అడ్మిషన్లు, తరగతులను ప్రారంభించాక పలు కళాశాలల యాజమాన్యాలు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. అనుమతుల్లేకుండా ఏర్పాటు చేసిన కళాశాలల యాజమాన్యాలపై విచారణ జరిపి కేసులను నమోదు చేయాలని కోరారు. అసోసియేషన్ జిల్లా నేతలు శ్రీనివాసులురెడ్డి, రాజాయాదవ్, మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాపూరు సీఐ బదిలీ

నెల్లూరు(క్రైమ్): గుంటూరు రేంజ్ పరిధిలో పది మంది సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులను మంగళవారం రాత్రి జారీ చేశారు. ఇందులో భాగంగా రాపూరు సీఐ సుబ్రహ్మణ్యాన్ని పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణ సీఐగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవర్నీ నియమించలేదు.

డెంగీపై అప్రమత్తత అవసరం

కొడవలూరు : డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెంలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కావ్య మాట్లాడుతూ డెంగీ వ్యాధిపై అప్రమత్తత అవసరమని తెలిపారు. 'ఎడిస్' అనే పగటి దోమ ద్వారా డెంగీ వ్యాపిస్తుందన్నారు. ఈ దోమ మంచి నీరు నిల్వ ఉన్న చోట ఉత్పత్తవుతుందన్నారు. ఇంటి పరిసరాల్లో తొట్టెలు, పాత టైర్లు, కుండల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తొలుత స్థానిక పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు కుష్టు(లెప్రసీ)ని ప్రాథమిక దశలోనే గుర్తించడంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్(డీపీఎంఓ) నరసారెడ్డి మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలుంటే లెప్రసీగా అనుమానించి వెంటనే పీహెచ్‌సీలో పరీక్ష చేసి నిర్ధారించాలన్నారు. ప్రాథమిక దశలో కుష్టును గుర్తించడం ద్వారా పూర్తిగా నివారించవచ్చని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ నాగరాజు, పీహెచ్‌ఎన్ విజయ, హెచ్ఎస్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు కవి శేషేంద్రశర్మ



తోటపల్లిగూడూరు : ప్రముఖ కవి దివంగత గుంటూరు శేషేంద్రశర్మ ఆదర్శప్రాయులని స్థానిక ఎంపీడీఓ, చిత్తూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పలమనేరు బాలాజీ అన్నారు. అంతర్జాతీయంగా కీర్తి గడించిన కవి గుంటూరు శేషేంద్రశర్మ స్వగ్రామమైన తోటపల్లిగూడూరులోని వారి స్వగృహంలో ఆయన చిత్రపటాన్ని జిల్లా గ్రంథాలయ శాఖ అధికారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలమనేరు బాలాజీ మాట్లాడుతూ సాహిత్యంలో గుంటూరు శేషేంద్రశర్మ సేవలు ఎనలేనివన్నారు. ఆయన రచనలు ఎందరో కవులకు ఆదర్శవంతంగా నిలిచినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయశాఖ కార్యదర్శి కుమార్‌రాజా మాట్లాడుతూ తన సాహిత్యంతో ప్రజల మనస్సు చూరగొన్న గుంటూరు శేషేంద్రశర్మ పేరును జిల్లా గ్రంథాలయానికి నామకరణం చేసేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా రచయితల సంఘం వారు దాదాపు 150 పుస్తకాలను కానుకగా ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కవులు ఈతకోట సుబ్బారావు, పాతూరి అన్నపూర్ణ, గోవిందరాజులు సుభద్రా దేవి, పెరుగు రామకృష్ణ, అవ్వారు శ్రీధర్ బాబు, పాయసం సుబ్రహ్మణ్యం, గుండాల నరేంద్రబాబు, శ్రీమన్నారాయణ, వెంకటప్పయ్య పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

- దోమల మోతతో ప్రబలుతున్న వ్యాధులు
- వర్షాకాలం వస్తున్నా ముందస్తు చర్యలు శూన్యం
- కాలువల్లో పూడికతీత పనులేవీ..?
- ఆందోళనలో ప్రజలు



నజీర్‌తోటలోని కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

నెల్లూరు సిటీ / నెల్లూరు (బారకాసు): నగరంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. పేరుకుపోతున్న చెత్త.. కాలువల్లో నిల్వ ఉంటున్న మురుగు.. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తూ దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. డయేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు విజృంభిస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. సింహపురిలో ఈ దుస్థితి నెలకొన్నా, అధికారుల్లో కనీస స్పందన కరువవుతోంది. ప్రజలు రోగాల బారినపడ్డాక ప్రత్యేక డ్రైవ్‌లను తూతూమంత్రంగా నిర్వహిస్తూ చేతులు దులుపుకొంటున్నారు.

ఫాగింగ్ ఏదీ..?

నెల్లూరు నగరంలో దాదాపు ఎనిమిది లక్షల మంది.. రూరల్ పరిధిలోని 18 పంచాయతీల్లో దాదాపు లక్ష మంది నివసిస్తున్నారు. ఇలా నగరం నానాటికీ విస్తరిస్తున్నా, దానికి తగిన విధంగా పారిశుధ్యాన్ని మెరుగుపర్చడంలో అధికారులు విఫలమవుతున్నారు. దోమల నివారణకు ఫాగింగ్‌తో పాటు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేసే ప్రక్రియకు దాదాపు మంగళం పాడారు. కాలువల్లో మురుగు పేరుకుపోతున్నా, తొలగించే దిశగా ఏమైనా చర్యలు చేపడుతున్నారానంటే అదీ నామ మాత్రమే. భారీ వర్షం కురిసిందంటే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



వహాబ్‌పేట సమీపంలోని కాలువలో చెత్తాచెదారాలు



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



ఫతేఖాన్‌పేటలోని ప్రధాన రహదారిలో దుస్థితి

ముందస్తు చర్యలు చేపట్టరూ..



వర్షాలు పడ్డాయంటే దోమల మోతతో కునుకు కరువవుతోంది. అధికారులు ముందస్తు చర్యలను చేపట్టకపోతే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది.

- గంగాధర్‌రెడ్డి, డైకస్ రోడ్డు

కాలువల్లో పూడికను తొలగించాలి



కాలువల్లో పూడికతీత పనులను చేపట్టి చెత్తా చెదారాలను తొలగించాలి. కాలువలను శుభ్రం చేయడం ద్వారా దోమల వ్యాప్తిని కొంతమేరైనా అరికట్టొచ్చు.

- ప్రసన్నకుమార్‌రెడ్డి, అల్లీపురం

వర్షాకాలం వస్తున్నా చలనమేదీ..?



నగరంలోని ఏ వీధిలో చూసినా పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. రోడ్లు, కాలువలను గతంలో ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితే లేదు. కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల ముందు మురుగు నిల్వ ఉండి అపరిశుభ్రత నెలకొంటోంది.

- షాజహాన్, న్యూ కాలనీ, జాకీర్‌హుస్సేన్‌నగర్

కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ



వైఎస్సార్‌నగర్‌లోని యూపీహెచ్‌సీలో..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కుష్టు వ్యాధి నివారణ సామాజిక బాధ్యత అని వైఎస్సార్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి ఇమ్రాన్ పేర్కొన్నారు. కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక యూపీహెచ్‌సీలో కమ్యూనిటీ పారామెడిక్స్, ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వేను ఈ నెల 18 నుంచి ఆగస్టు రెండు వరకు నిర్వహించనున్నామని తెలిపారు. వ్యాధిని సకాలంలో గుర్తించి మందులు వాడితే నయమవుతుందని చెప్పారు. డీపీఎంఓ సుబ్బయ్య, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ఆస్పత్రి కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- కోటమిట్ట, మల్లికార్జునపురం, రాజాగారివీధి, చాకలివీధిలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటమిట్టలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ ఖాదర్‌వలీ మాట్లాడారు. కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వేలో భాగంగా ప్రతి ఇంటికీ ఆరోగ్య సిబ్బంది, స్థానిక వలంటీర్ వెళ్లి వైద్య పరీక్షలు చేసి వాటి లక్షణాలను వివరించాలని కోరారు. వైద్యులు నవీన్‌కృష్ణ, గీతాంజలి, సుబ్బయ్య, రమణారెడ్డి, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నగరవాసులకు నరకం

నెల్లూరు(క్రైమ్): ట్రాఫిక్ అధికారుల చర్యలతో నగరవాసులు మంగళవారం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రొట్టెల పండగ నేపథ్యంలో ముందస్తు సమాచారమివ్వకుండానే రహదారులను అధికారులు మూసేశారు. ఆర్టీసీ నుంచి కొండాయపాళెం గేట్ సెంటర్ వరకు యూటర్న్ తీసుకునేందుకు సైతం అవకాశం లేకుండా చేశారు. కస్తూరిదేవి గార్డెన్స్ వద్ద టర్నింగ్‌ను మూసేశారు. ఫలితంగా కిమ్స్ ఆస్పత్రి వద్ద వాహనాలు బారులుదీరడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



కస్తూరిదేవి గార్డెన్స్ వద్ద రహదారి మూసివేత

రంగడికి బంగారు గరుడసేవ నేడు

నెల్లూరు(బృందావనం): తొలి ఏకాదశిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారికి 108 లీటర్ల పాలతో విశేష తిరుమంజనాన్ని బుధవారం నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంగారు గరుడసేవను సాయంత్రం నిర్వహించనున్నామని వివరించారు. భక్తులు తరలిరావాలని కోరారు.

రైల్వేస్టేషన్లలో భద్రత కట్టుదిట్టం



మాట్లాడుతున్న విజయభాస్కర్‌రావు

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న నేపథ్యంలో రైల్వేస్టేషన్లలో భద్రతను కట్టుదిట్టం చేశామని నెల్లూరు రైల్వే డీఎస్పీ విజయభాస్కర్‌రావు తెలిపారు. బందోబస్తు విధుల నిమిత్తం హాజరైన నెల్లూరు, ప్రకాశం, గుంతకల్ పోలీస్ అధికారులు, సిబ్బంది, ఆర్పీఎఫ్ అధికారులతో సమావేశాన్ని నెల్లూరు రైల్వే పోలీస్ స్టేషన్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధులను అప్రమత్తంగా నిర్వర్తించాలని సూచించారు. నెల్లూరు ప్రధాన, సౌత్, వేదాయపాళెం, వెంకటాచలం రైల్వేస్టేషన్లలో 87 మంది సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేసి నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రంగనాయకులపేట గేట్, ఆత్మకూరు బస్టాండ్, నక్కలోళ్ల సెంటర్, సౌత్ రైల్వేస్టేషన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా గస్తీని ముమ్మరం చేశామని వెల్లడించారు. స్టేషన్లలో రైళ్లు నిదానంగా వెళ్లేలా చర్యలు చేపట్టామని వివరించారు. నెల్లూరు రైల్వే సీఐ భుజంగరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్, నెల్లూరు, కావలి, సూళ్లూరుపేట ఎస్సైలు మాలకొండయ్య, అరుణకుమారి, శివసామ్య తదితరులు పాల్గొన్నారు.

మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



నెల్లూరు (టౌన్): ఏపీటీఎఫ్ విద్యా, వైజ్ఞానిక మహాసభల కరపత్రాలను డీఈఓ రామారావు, సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి మంగళవారం ఆవిష్కరించారు. నగరంలోని డీఈఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడారు. ఏపీటీఎఫ్‌ను స్థాపించి 80 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని టౌన్‌హాల్లో మహాసభలను వచ్చే నెల పదిన నిర్వహించనున్నామని వివరించారు. ఏపీటీఎఫ్ బాధ్యులు పిచ్చిబాబు, రియాజ్, కృష్ణారెడ్డి, జుల్ఫికర్ అలీ, కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, కరీమ్ మొహిద్దీన్, వెంకటేశ్వర్లురెడ్డి, రామసుబ్బారెడ్డి, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆర్‌ఎంను కలిసిన నేతలు



నెల్లూరు సిటీ: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ ఆర్‌ఎం విజయరత్నాన్ని ఏపీపీటీడీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు కేపీ రెడ్డి మాట్లాడారు. అసోసియేషన్ తరఫున అన్ని విధాలా సహాయ, సహకారాలను అందిస్తామని తెలిపారు. నేతలు శశికుమార్‌రెడ్డి, ఇస్మాయిల్, సుబ్బారావు, వెంకటేష్, ప్రకాష్, శ్రీనివాసులు, పీజే రావు, హరికిశోర్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డిని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు.

21న వ్యాసరచన పోటీలు

నెల్లూరు(బృందావనం): గురుపూర్ణిమను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఈ నెల 21న నిర్వహించనున్నామని టీపీఎస్ కల్యాణ సదన్ మేనేజింగ్ ట్రస్టీ దేశభొట్ల ఫణిరత్నం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురాణాల్లో భగవంతుడి గురురూప అవతారాలు అనే అంశంపై 6, 7వ తరగతుల వారికి.. పురాణాలు, స్మృతుల ప్రకారం ధర్మం, భక్తి, జ్ఞానం అంటే ఏంటి.. నేటి సమాజంలో ఆవశ్యకత అనే అంశంపై 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు పోటీలను నిర్వహించనున్నామని వివరించారు. పలువుర్ని సత్కరించనున్నామని చెప్పారు.



బారాషహీద్ దర్గాకు వస్తున్న భక్తులు



రొట్టెలను మార్చుకుంటూ..



ఘాట్‌ను శుభ్రపరుస్తున్న కార్మికులు



దర్గా ప్రాంగణంలో సేదతీరుతూ..



బారాషహీదుల దర్శనార్థం క్యూలో..

సందడే.. సందడి

రొట్టెల పండగ అధికారికంగా ప్రారంభంకాక ముందే నగరంలోని స్వర్ణాల చెరువులో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు బారాషహీదులను దర్శించుకుంటున్నారు. అనంతరం స్వర్ణాల చెరువు వద్ద రొట్టెలను మార్చుకుంటున్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో కోలాహలం నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



సెల్ఫీలతో సందడి



భక్తజనసంద్రమైన స్వర్ణాల చెరువు

రొట్టెల పండగకు ఏర్పాట్లు పూర్తి



సమావేశానికి హాజరైన అధికారులు

- జేసీ సేదు మాధవన్

నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని జేసీ సేదు మాధవన్ పేర్కొన్నారు. రొట్టెల పండగకు సంబంధించి బారాషహీద్ దర్గా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌లో వివిధ శాఖల అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశుభ్రతకు పెద్దపీట వేశామని, దర్గా ప్రాంతాన్ని వివిధ జోన్లుగా విభజించి, ప్రతి జోన్‌కు అధికారులను నియమించి వసతులను పర్యవేక్షిస్తున్నామని వివరించారు. స్వర్ణాల చెరువులోని నీటిని పరిశుభ్రంగా ఉంచామని తెలిపారు. ఘాట్ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపర్చేందుకు వీలుగా అగ్నిమాపక వాహనాన్ని ఏర్పాటు చేశామని వెల్లడించారు. దర్గా ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్టాళ్లలో ఆహార పదార్థాలు నాణ్యతగా ఉండేలా తనిఖీలు చేస్తున్నామన్నారు. నగరంలోని 14 పార్కింగ్ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం, మొబైల్ టాయిలెట్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా, అదనపు కమిషనర్ శర్మద, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ, ఆర్డీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.